






ఓట్ల నమోదులో జరిగిన అక్రమాలపై కలెక్టర్ చక్రధర్‌బాబుతో చర్చిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

**ఎంఎల్‌సి ఓట్ల నమోదులో భారీ అక్రమాలు** వార్త మెయిన్‌లో..

# మహిళలపై హింసను అరికట్టాలి

## 'ఐద్వా' నిరసన ప్రదర్శన




నిరసన ప్రదర్శన చేపట్టిన ఐద్వా నాయకులు

**ప్రజాశక్తి-నెల్లూరు** : జిల్లా వ్యాప్తంగా వరుసగా చోటు చేసుకుంటున్న ఘటనలకు కారణంగా బాలికల తల్లిదండ్రులు ఓ విధమైన అభద్రతాభావంతో ఆందోళనకు గురవుతున్నారన్నారని ఐద్వా నాయకులు నెల్లూరు నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సోమవారం నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి విఆర్‌సి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ స్థాయిలో ఐద్వా జిల్లా సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ నిరసన ప్రదర్శనలో మహిళలు, కళాశాల బాలికలు, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి పాలన ప్రారంభమైన నాటి నుంచి మహిళలకు, బాలికలకు ఇంటా బయట రక్షణ కరువైపోయిందన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఇటువంటి ఘటనలు మరీ అధికమైపోయాయన్నారు. ముఖ్యంగా కార్పొరేట్ స్కూల్స్‌లో చిన్నపిల్లలపై, బాలికలపై లైంగిక వేధింపులు ఎక్కువైపోతున్నాయన్నారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై ఐక్యరాజ్య సమితి స్పందించి, వీటిని అరికట్టేందుకు మహిళలను చైతన్య పరిచే క్రమంలో 2000 సంవత్సరాన్ని మహిళల హింసా వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించింది. నాటి నుంచి నేటి వరకు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఆదిశగా ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఐద్వా సంఘం నాయకురాలు ఎ.రమమ్మ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన తరువాత అంచలంచెలుగా మద్యపాన నిషేధం అమలు చేస్తామని ప్రజలకు హామీ చేసి అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి ప్రభుత్వం ఆదిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్రంలో యథేచ్ఛగా మద్యం విక్రయాలకు అవకాశం కల్పించి మహిళలపై, బాలికలపై లైంగిక వేధింపులు జరిగేందుకు పరోక్షంగా అవకాశం కల్పింస్తుందన్నారు. నగరంలో ఇటువంటి ఘటనలు అనేకం వెలుగులోకి వస్తున్నాయన్నారు. వాస్తవానికి మహిళలపై, బాలికలపై లైంగిక వేధింపులు చోటు చేసుకుంటే వాటిలో ఒకటో, రెండో మాత్రమే బయటకు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు టి.శివకుమారి, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వి.సుబ్బమ్మ, కె.పద్మ, రూరల్ అధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు కె.విజయమ్మ, బి.నాగమ్మ, షంషాద్, జాకీరా, మహాలక్ష్మమ్మ, సంపూర్ణ పాల్గొన్నారు.

### యుటిఎఫ్ ఆధ్వర్యంలో
## ఉపాధ్యాయుల మెరుపు ధర్నా

**ప్రజాశక్తి-నెల్లూరు** :ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులను, విడుదల చేస్తున్న ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మెరుపుధర్నా చేపట్టారు. సోమవారం గాంధీబొమ్మ సెంటర్‌లో ఉపాధ్యాయులు చేపట్టిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బాబిరెడ్డి, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.




నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థలో ఈ ప్రభుత్వం తీసుకొస్తున్నటువంటి మార్పులకనుగుణంగా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లతో బోధన జరపాలని భావిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖలో ప్రమోషన్లు నిర్వహిస్తే ఏర్పడే ఉపాధ్యాయ ఫోస్టుల ఖాళీలను ఎక్కడ భర్తీ చేయాల్సి వస్తుందో అన్న ఆలోచనతో ప్రమోషన్లను నిలిపివేసిందన్నారు. డిప్యూటేషన్ పేరుతో ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటూ ఆదేశాలు జారీ చేయడం దుర్మార్గమన్నారు.యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చలపతి శర్మ, వీవి శేషులు ,జిల్లా గౌరవాధ్యక్షులు తులసి రాంబాబు, అసోసియేట్ అధ్యక్షులు ఎంసీ అచ్చయ్య ,కోశాధికారి మురళీధర్ రావు, జిల్లా కార్యదర్శిలు ఖాజావలి, నాగిరెడ్డి ,సురేంద్రబాబు ,దయాకర్ పాల్గొన్నారు.

## వికలాంగులకు అండగా ప్రభుత్వం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

**ప్రజాశక్తి-నెల్లూరు** :సమాజంలో మెరుగైన జీవనం సాగించడానికి విభిన్నప్రతిభావంతులకు అన్ని విధాల ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పొదలకూరు రోడ్డులో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వైకల్య నిర్ధారణ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐదు రోజులపాటు ఎంపిక చేసిన పాఠశాలల్లో వైకల్య నిర్ధారణ వైద్య శిబిరాలు పరీక్షలు నిర్వహించి అవసరమైన ఉపకరణాలను అందించనున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి నాగరాజు కుమారి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, త్వరలోనే బ్యాటరీ ట్రై సైకిల్స్, ఇతర ఉపకరణాలు అందిస్తామన్నారు. తొలుత ప్రత్యేక క్యాంపును కలెక్టర్ ప్రారంభించి వైకల్య నిర్ధారణ పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పి సిఇఒ చిరంజీవి, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, బిసి వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జెడ్పి పాఠశాల హెచ్ఎం ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

## 7న నెల్లూరుకు సిఎం రాక

**నెల్లూరు** :సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 7వ తేదీన నగరానికి రానున్నారు. బుధవారం రూరల్ పరిధిలోని కనుపర్తిపాడు విపిఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగే సూళ్లూరుపేట ఎంఎల్‌శ్రీ కిలివేటి సంజీవయ్య కుమార్తె వివాహానికి ఆయన హాజరుకానున్నట్లు కలెక్టర్ చక్రధర్‌బాబు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం భద్రత ఏర్పాట్లపై కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు, ఎస్‌పి సిహెచ్ విజయ రావుతో కలిసి పరిశీలించారు. కనుపర్తిపాడు జడ్పీ హైస్కూల్లో ఏర్పాటుచేసిన హెలిపాడ్ వద్ద చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లు పలు సూచనలు చేశారు. అనంతరం విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించారు. జిల్లా అధికారులు ఉన్నారు.

## 'సుందరయ్య జ్యోతి' అందుకున్న ప్రతినిధులు



జ్యోతి అందుకుంటున్న 'వ్య.కా.స ప్రతినిధులు

**నెల్లూరు** :ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29 రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం పురుడుపోసుకున్న గ్రామం ఆలాగానిపాడులో అమరజీవి 'సుందరయ్య జ్యోతి'ని రాష్ట్ర మహాసభ ప్రతినిధులు అందుకున్నారు. ఈ జ్యోతి 8న జంగారెడ్డి గూడేనానికి చేరుకుంటుంది. మహాసభల ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొనే జాతీయ నాయకులు బృందా కారత్, అఖిల భారత కార్యదర్శి బి.వెంకట్ , అధ్యక్షుడు విజయరాఘవన్ చేతికి మహాసభల ప్రతినిధి వర్గం అందజేయనుంది. అలగాని పాడులో సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమ రాజు మాట్లాడారు. పేదవారి జీవితాల్లో వెలుగు రావాలని జీవితాలు బాగుపడాలని, పేదలందరికీ భూమి ఇళ్లు కావాలని, అందరికీ విద్య, వైద్యం అందుబాటులోకి రావాలనే అనేక పోరాటాలకు పుచ్చలపల్లి సుందరయ్య ఊపిరిగా నిలిచారన్నారు. కౌలు రైతుల సంఘం సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరుగోపాల్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు బి.పెద్దబ్బయ్య.మండల కార్యదర్శి మోడిగుంట రామచంద్రయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి మడపర్తి అంకయ్య,సీఐటీయూ నాయకులు డి ,ఏడుకొండలు కౌలురైతుసంఘం మండల కార్యదర్శి అమర శేఖర్ సిపిఎం సీనియర్ నాయకులు చిట్టెటి పిచ్చయ్య కోసురు నరసయ్య ఎంపిటిసి కుడుములు మోహన్ పాల్గొన్నారు

## 'స్పందన' అర్జీలకు సత్వర పరిష్కారం

**నెల్లూరు** :ప్రజల నుంచి అందే స్పందన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో జరిగిన స్పందన కార్యక్రమానికి సంయుక్త కలెక్టర్ కూర్మానాథ్, డి ఆర్ ఓ సి వెంకటనారాయణమ్మలతో కలసి కలెక్టర్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చినవారి వినతి పత్రాలు స్వీకరించారు. జెడ్పి సిఇఒ చిరంజీవి, తెలుగంగ ప్రాజెక్టు ప్రత్యేక కలెక్టర్ ఎంవి సుధాకర్, డి ఆర్ డిఎ, హౌసింగ్, మెప్మా పీడీలు కె.వి సాంబశివారెడ్డి, నాగరాజు, రవీంద్ర, ఆర్‌జెడి ఇన్‌ఛార్జి డిఇఒ సుబ్బారావు, ఉన్నారు.

## మద్యం షాపు ఎత్తివేయాలి : ఐద్వా




**ప్రజాశక్తి -కందుకూరు** :కందుకూరులోని 6వ వార్డు సుందరయ్య నగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన జరిగింది. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్కే మున్వర్ సుల్తానా మాట్లాడుతూ సుందరయ్య నగర్ ,మహబూబ్ నగర్, లుంబినీవనం మూడు ప్రాంతాలు కలిసి ఉంటాయన్నాడు. ఎక్కువగా పేదలు నివసిస్తున్నఆ ఏరియాలో అక్కడ మంచినీళ్ల వసతి లేదు, రోడ్లు లేవు, వీధిలో దీపాలు లేవనిప్రభుత్వ అధికారులు దష్టికి తీసుకెళ్లిఆ పట్టించుకోలేదు. ఆ ప్రాంతంలో మద్యం షాపు తీసుకరావడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే ఆ షాపును ఎత్తేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను, లైంగిక వేధింపులను నివారించాలన్నారు. ఐద్వా నాయకులు ఎస్కే మల్లిక, ఎస్.కె షాహిదా, కుమారి, ఎస్కే అస్మా ,ఎస్కే షఫీ ,ధనలక్ష్మి ,చంద్రమ్మ ,శంషాద్ ఉన్నారు.

## 'వీఎస్‌యు'లో క్రీడలు ప్రారంభం

**ప్రజాశక్తి - వెంకటాచలం** : విక్రమ సింహపురి యునివర్సిటీ మెన్, ఉమెన్ అంతర కళాశాలల క్రీడలు యునివర్సిటీ కళాశాలలో సోమవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. పిన్సిపాల్ విజయ ఆనంద కుమార్ బాబు ఆధ్వర్యంలో యునివర్సిటీ అంతర్ కళాశా లల క్రీడలు, విశ్వవిద్యాలయ ఉకులపతి ఆచార్య సుందరవల్లి, ఆచార్య రా మ చంద్రారెడ్డి ప్రారంభించారు. దాదాపు 20 కళాశాలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. స్పోర్ట్స్ బోర్డ్ సెక్రెటరీ కే. సునీత, ప్రవీణ్ , రవీద్రమ్మ అబ్జర్వర్స్ విజయకళ, వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

**ప్రజాశక్తి -లింగసముద్రం** : విద్యుత్ షాక్ తగిలి యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు లింగసముద్రం మండలం అన్నెబోయినపల్లి దళితవాడకు చెందిన ఆంద్ర బ్రహ్మతేజ (18) వీర రాఘవునికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు చేస్తున్న సమయంలో బహ్మతేజ నీళ్లు వేసేందుకు మోటార్ వద్ద వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడే తీసిన పిల్లర్ గుంతల్లో పడి దుర్మరణం చెందాడు. గమనించిన మరో వ్యక్తి బ్రహ్మతేజను పట్టుకోవడానికి ప్రయాత్నం చేయగా అతనికి కూడా షాక్ కొటింది. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి బ్రహ్మతేజను గుంతలో నుండి బయటకు తీశారు. అప్పటికే మృతిచెందాడు. చేతికంది వచ్చిన కొడుకు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

## చలివేంద్రం భూములపై కబ్జాదారుల కన్ను : టిడిపి

**వెంకటాచలం** : గ్రావెల్ దందాలో మునిగితేలుతున్న తోడేళ్ల బ్యాచ్ సీతమ్మ చలివేంద్రం భూములపై కన్నేసిందని టిడిపి మండల అధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్ ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. కోట్ల విలువైన భూములను బినామీల పేర్లపై ఎక్కించుకుంటూ అసలు రైతులను మోసం చేసే కుట్ర జరుగుతోందన్నారు.అనాదిగా ఆ భూములను సాగుచేసుకుంటున్న రైతుల జోలికి తాము వెళ్లబోమని మేం మొదటే చెప్పామన్నారు.ఆ తోడేళ్ల బ్యాచ్ వెనుక ఉన్న బిగ్ బాస్ ఎవరు.. ఎవరు చెబితే గత రెండేళ్లలో తహశీల్దార్ రికార్డుల్లో పేర్లు ఎక్కించారో చెప్పాలన్నారు. సీతమ్మ చలివేంద్రం భూముల విషయంలో సోమిరెడ్డి కుటుంబపై ఆరోపణలు చేసే వారు అయ్యప్పగుడిలో ప్రమాణానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. టిడిపి నేతలు రావూరి రాధాకష్ణమనాయుడు, మావిళ్ల పల్లి శ్రీని వాసులు నాయుడు మునుస్వామి ఉన్నారు.

## రేకుల షెడ్డు తొలగించాలి

**పొదలకూరు** :పట్టణంలోని విఘ్నేశ్వర పురం కాలనీని వద్దనున్న చెరువులో అక్రమంగా రేకులషెడ్డు నిర్మించి జంతు వధ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నమామి గంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల.రమేష్ డిమాండ్ చేశారు. సోమవారంకలెక్టర్ చక్రధర్ బాబును కలిసి వినతిపత్రం అందించారు. జంతువధకు కారణమైన వారి పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు** :ఆత్మకూరులో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే సిఐటియు జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి మారుబోయిన రాజా, సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య కోరారు. సోమవారం మండలం లోని నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ సమావేశం జక్కా వెంకయ్య స్మారక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఆటో స్టాండ్ కమిటీ సభ్యుడు నాశీన పరశురాం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాజా, వెంకయ్యలు పాల్గొని మాట్లాడారు. యూనియన్ అధ్యక్షుడు కె. కష్ణ, కమిటి సభ్యులు దయాకర్, కె. మల్లి, గోపి, గణేష్, మనోహర్, భాస్కర్ ఉన్నారు.

## విద్యార్థులకు శిక్షణ తరగతులు

**ప్రజాశక్తి -వెంకటాచలం** : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా విద్యార్థులకు ఆప్టిట్యూడ్ , ఇతర ఉద్యోగ నైపుణ్యాల కోసం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కార్యనిర్వాహకురాలు డాక్టర్ జె విజేత ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఉపకులపతి ఆచార్య జి సుందరవల్లి , రిజిస్ట్రార్ డాక్టర్ పి రామచంద్ర రెడ్డి ప్రశంసించారు.

### పరిశ్రమలకు భూములు ఇస్తే
# జీవనాధారం కోల్పోతాం..!

### గ్రామసభలో చేవూరు, రావూరు గ్రామస్తులు




గ్రామ సభకు హాజరైన భూ యజమానులు

**ప్రజాశక్తి -కందుకూరు, గుడ్లూరు** : గుడ్లూరు మండలం, చేవూరులో సోమవారం గ్రామ సభ జరిగింది. ఈ సభకు సర్పంచ్ శెట్టి పల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. స్పెషల్ కలెక్టర్ పద్మా వతి, తహశీల్దార్ లావణ్య పాల్గొన్నారు. ఈ సందరభంగా ఎపి మారిటం బోర్డు యండి ప్రతాప్ రెడ్డి స్పందిస్తూ పోర్టు అనుబంధ పరిశ్రమల కోసం చేవూరులో 1545ఏకరాలు తీసుకుంటాం.. 'మీఅభిప్రాయం చెప్పండి అని అన్నారు. దీనికి గ్రామస్తులంతా ఏకగ్రీవంగా తామంతా పరిశ్రమల కోసం భూములు ఇవ్వలేము.. అని ముక్త కంఠంతో నినదించారు. తొలుత గ్రామంలో భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామస్తుల తరపున ఉమ్మడి అర్జీ అందజేశారు. 300మంది రైతులు వ్యక్తి గతంగా తాము భూములు ఇవ్వలేమని అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా రావూరి నాగయ్య అనే గిరిజనుడు తమకు భూములు లేవు,, మీరు భూములు తీసుకుంటే, ఆ భూముల మీద బతికే తామ ఎలా బతకాలంటూ బోరున విలపించారు. భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు పోటేళ్ల మురళి, ఎన్.వెంకటేశ్వర్లు , ఇరువూరి బ్రహ్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లూరి మాల్యాద్రి మాట్లాడుతూ ఇక్కడ రెండు పంటలు పండే పంట భూములు. భూమి మీద ఆధార పడే వారు 2వేల మంది ఉన్నారు. వేలాది పశువులు మీద ఆధార పడి బతికే వారు ఉన్నారు. భూములు ఇస్తే వారంతా జీవనాధారం కోల్పోయి వీధిన పడతారన్నారు. దళితుల భూములు రోడ్డుకు తీసుకుని, నష్ట పరిహారం ఇవ్వ లేదని, మామిడి తోట భూములు తీసుకొని, సమాధానం చెప్పడం లేదని, ముందు వాటికి పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నాయకులు పి పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జీ.వెంకటేశ్వర్లు, భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు ఉపేంద్ర, హనుమంతరావు, రామకష్ణ, మాల్యాద్రి, శ్రీను, మందలపు హరిబాబు, పిచ్చయ్య రాజగోపాల్ పాల్గొన్నారు.

## టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేమి ఖర్మ'

**ప్రజాశక్తి -ఉలవపాడు** : టిడిపి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి స్పందన లభించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చి సమస్యలను ఏకరువు పెట్టారు. వైసిపి పాలనలో బతకలేక పోతున్నామంటూ నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావుతో తమ ఆవేదన పంచుకున్నారు. ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక ఎస్సీ కాలనీ, అంబేద్కర్ విగ్రహం సెంటర్, వినాయక గుడి ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిత్యావసర వస్తువుల ధరలు, చార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని పలువురు మహిళలు నాగేశ్వరరావు దష్టికి తెచ్చారు. వైసిపి నేతల వేధింపులను ప్రస్తావించారు. కావాలని పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారని తెలిపారు. అనంతరం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, ఎన్నికలకు ముందు చేసినవన్నీ అబద్ధపు ప్రచారాలేనని విమర్శించారు. మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీనివాసులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు అంచుపోగు వాసు, ఎంపీటీసీ దార్ల యలమందమ్మ, మండల తెలుగు యువత అధ్యక్షుడు తొట్టెంపూడి మాల్యాద్రి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు సన్నేబోయిన ప్రభావతి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు యేజెస్, బీసీ సెల్ అధ్యక్షుడు ఓగుబోయిన యానాది, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రావినూతల రమేష్ ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఇంటూరి

## శాశ్వత భూ హక్కు పత్రంతో మేలు

**ప్రజాశక్తి-నెల్లూరు** :శాశ్వత భూహక్కు పత్రాల జారీతో భూయజమానులకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ కె విఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు.సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ సంయుక్త కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డిఆర్ఓ వెంకట నారాయణమ్మలతో కలిసి వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్షా పథకానికి చెందిన భూకమత పటాల పుస్తకాలు ఆవిష్కరించారు. అనంతరం ఆ పుస్తకాలను పరిశీలించి వాటితో పాటు గ్రామ సర్వేయర్లకు ఉపయోగపడే ఒక బ్యాగు, టోపీ, బూట్లు కల్గిన కిట్లను జిల్లా కలెక్టర్ సర్వే భూ రికార్డుల సహాయ సంచాలకులు హనుమాన్ ప్రసాద్ కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం కింద తొలి దశలో 30 మండలాల్లోని 68 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమం చేసి భూకమతాల పటాల పుస్తకాలను రూపొం దించామన్నారు.




## టిఎన్ఎస్ఎఫ్ ధర్నా

**నెల్లూరు** :ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల పరిస్థితి రోడ్డు మార్జిన్లలో నిద్రించే అనాథల కన్నా దారుణంగా ఉందని తెలుగు నాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు షేక్ అమల్లా విమర్శించారు. హాస్టల్స్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. టిఎన్ఎస్ఎఫ్ నాయకులు వసీం, మారుతి, మణి, హేమంత్, నరేంద్ర, వెంకట్ యాదవ్, రవీంద్ర, రాజేష్, రమేష్, సునీల్ పాల్గొన్నారు.

## కమిషనర్‌కు బిటిఎ వినతి

**ప్రజాశక్తి-నెల్లూరు** : నగర పాలక సంస్థ పాఠశాలల్లో ఉపాధ్యాయలుగా పనిచేస్తున్న వారికి పెండింగ్ స్కేల్స్‌ను వెంటనే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని బహుజన టీచ్చర్స్ అసోసియేషన్ నగర శాఖ కమిషనర్ హరితకు విజ్ఞప్తి చేసింది. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి హాజరైన వినతిపత్రం అందజేశారు. బిటిఎ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లం వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిలర్ బి. భాస్కరయ్య , నగర అధ్యక్షులు షేక్ ఖాజా రహంతుల్లా, ప్రధాన కార్యదర్శి కోలా కిరణ్ ,కార్యదర్శులు కోనేటి తిరుపతయ్య,తలారి మల్లికార్జున, సిహెచ్.మురళి పాల్గొన్నారు.

## రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి అమానుషం

**కందుకూరు** :బిసి యువ నాయకులు రామచంద్ర యాదవ్ ఇంటి పై పుంగనూరులో మంత్రి పెద్ది రెడ్డి అండతో వైసిపి గూండాల దాడి చేశారని, ఈ సంఘటనను తీవ్రంగా ఖండి స్తున్నట్లు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ దాడి రాష్ట్రంలో నిరంకుశ పాలనకు అద్దం పడుతుం దన్నారు. తెలుగు యువత జగన్ పాలనలో రాష్ట్రంలోని బిసి నాయకుల పై వైసిపి నాయకుల దాడులు మితిమీరుతున్నా యన్నారు. ఎన్ని దాడులు చేసిన ,ఎన్ని విధ్వంసాలు చేసిన ఎవరు భయపడరనీ ,రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వానికి, ప్రభుత్వ పెద్దలకు తగిన గుణపాఠం చెప్తారన్నారు. బిసిలకు అండగా ఉండేది టిడిపియేనన్నారు.

**తోటపల్లిగూడూరు** : రైతుల సమస్యలపై రైతుభేరి కార్యక్రమం నిర్వహించేందుకు ప్రయత్నించిన పుంగనూరుకు చెందిన బిసి నాయకులు రామచంద్రయ్య యాదవ్ ఇంటిపై వైసిపి రౌడీ మూకలు దాడి చేయడం అమానుషమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర విమర్శించారు. రామచంద్రయ్య యాదవ్‌పై దాడిని ఖండిస్తూ సోమవారం మండలంలో టిడిపి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సురేంద్ర మాట్లాడారు. రామచంద్రయ్య యాదవ్ బీసీ కావడమే నేరమా అని ప్రశ్నించారు. సమస్యలపై పోరాడే వారి ప్రాణాలు తీయడమే మంత్రి పెద్దరెడ్డికి తెలిసిన విద్య అని విమర్శించారు. బిసి నాయకులు వీరబోయిన గంగాధర్, చెవూరు శ్రీనివాసులు, మన్నెం జితేంద్ర గౌడ్, గోపిరెడ్డి, వెంకటేశ్వర్లు, నరుకూరు ఎంపిటిసి తిరుపతి పార్లమెంటరీ టిడిపి కార్యదర్శి కొణతం రఘబాబు ఉన్నారు.

## వైసిపి పాలనలో బిసిలకు తీవ్ర అన్యాయం : టిడిపి

**పొదలకూరు** :వైసిపి ప్రభుత్వంలో బిసిలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పల్లారపు కష్ణయాదవ్, వెంపులూరు రామకష్ణ గౌడ్, మండల, పట్టణ అధ్యక్షుడు తలచీరు.మస్తాన్ బాబు, మల్లికార్జున్ నాయుడు విమర్శించారు. సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మండలనాయకులతో "ఇదేం ఖర్మ రాష్ట్రానికి" కార్యక్రమం లో భాగంగా వైసిపి పాలనలో బిసిలకు జరుగు తున్న అన్యాయంపై నిరసన వ్యక్తం చేశారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. విలేకర్లతో నాయకులుమాట్లాడారు. టిడిపి సీనియర్ నాయకులు కోవూరు వెంకటేశ్వర్లు నాయుడు, కోడూరు.భాస్కర్ రెడ్డి, బోగోలు భాస్కర్ రెడ్డి, మద్దిరిళ్ళ నరసింహులు, పిన్నెం.ప్రభాకర్, అలుపూరు.శ్రీనివాసులు, బాబు నాయుడు, పెంచలయ్య, కలగట్ల.సందీప్ అరుణ, సాధం గిరీష్, బాల చంద్ర, రోహిత్ ,కార్తిక్ పాల్గొన్నారు.

**రాపూరు** : మండలంలో మాజీ ఎంఎల్ఎ కురుగొండ్ల రామకష్ణ ఆదేశాల మేరకు బిసి నేతలు బిసిలకు ఇదేం ఖర్మ కార్యక్రమం చేపట్టారు. బిసిలకు వైసిపి ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను నిరసిస్తూ తహశీల్దార్ కార్యాలయం దగ్గర ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రాపూరు మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, అధ్యక్షులు మాజీ ఎఎంసి చైర్మన్ కండే రమణయ్య, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి నువ్వుల శివరామకష్ణ పాల్గొన్నారు.

### తైక్వాండో పోటీలలో
## 'ఆక్సఫర్డ్' విద్యార్థుల ప్రతిభ



**ప్రజాశక్తి -కందుకూరు** : తైక్వాండో పోటీలలో కందుకూరు ఆక్సఫర్డ్ విద్యార్థులు ప్రతిభ చూపి పథకాలు సాధించారని పాఠశాల ఛైర్మన్ ఉన్నం భాస్కర్ రావు తెలిపారు. గత నెలలో నంద్యాలలో జరిగిన రెండో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ క్యాడేట్ ,జూనియర్ ,సీనియర్ తైక్వాండో పోటీలలో ఆక్సఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు తెలిపారు. బంగారు పతకాలు సాధించిన వారిలో 8 మంది ఉన్నారన్నారు. బంగారు పతకాలు సాధించిన వారిని సాధించినవారిని అభినందించడాని సోమవారం పాఠశాలలో సభ నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ ఉన్నాం భాస్కరరావు మాట్లాడారు. కషి పట్టుదల ఉంటే విజయం మన బానిస అవుతుందని తెలిపారు. డైరెక్టర్ బాల భాస్కర్ మాట్లాడుతూ సాధించాలనే సంకల్పం ఉంటే దేనినైనా సాధించవచ్చునని తెలిపారు. కళాశాల డైరెక్టర్ బి నరేంద్ర, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్స్ రామారావు, మల్లికార్జున ఉన్నారు.

## ప్రొఫెసర్ పున్నారావుకు అవార్డు



**ప్రజాశక్తి-కందుకూరు** : ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ మెకానికల్ విభాగపు సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జి.వి పున్నారావు అరుదైన అవార్డును దక్కించుకున్నారని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్రెయిన్ బో విజన్ సొల్యూషన్స్ ఇండియా లిమిటెడ్ వారు జాతీయ స్థాయిలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో యువ ఆచార్య అవార్డును ఆయన ఆల్ ఇండియా టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎఐసిటిఇ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసరు డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్(ఢిల్లీ) ద్వారా అందుకున్నారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఆదివారం జరిగిన అవార్డుల ఉత్సవంలో పలువురు విద్యావేత్తల సమక్షంలో ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు.బ్రెయిన్ ఓ విజన్ సంస్థను స్థాపించి పదేళ్లు అయిన సందర్భంగా జాతీయస్థాయిలో బోధన - పరిశోధనా అంశాలపై జరిగిన పోటీలలో జ్యూరీ 18 వేల దరఖాస్తులను స్వీకరించారు. 350 మందిని తొలి జాబితాకు ఎంపిక చేశారని పున్నారావు వివరించారు. అందులో అవార్డులకు 160 మందిని ఎంపిక చేయగా తనకు జ్యూరీ అవార్డు అందుకునేందుకు ఆహ్వానం పలికా రన్నారు.కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ప్రిన్సిపల్, డాక్టర్ సి.హె.చ్. రవికుమార్, సహచర అధ్యాపకులు కె.సింగయ్య, సతీష్ బాబు, కోటయ్య, రవీంద్ర అవార్డు గ్రహీతను కళాశాలలో అభినందించారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**తోటపల్లిగూడూరు** : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి ప్రభుత్వ మద్యం దుకాణాల సూపరవైజర్లు, సేల్స్ మెన్లు సోమవారం పాలాభిషేకం చేశారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద మండలంలోని 6 ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమం చేపట్టారు. సూపర్‌వైజర్లకు రూ. 4వేలు, సేల్స్ మెన్లకు 3, 500 గౌరవ వేతనాన్ని ప్రభుత్వం పెంచింది. ఈ నేపథ్యంలో వారు హర్షం వ్యక్తం చేశారు. సేల్స్ మెన్లు మోదర్ నాయుడు, తేలు మేటి సునీల్ కుమార్‌మాట్లాడారు. సిహెచ్ వెంకటేశ్వర్లు, కె. వెంకటరమణయ్య, ఏడు కొండలు, వెలశిరి శివకుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

**పొదలకూరు** : పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సూపర్ వైజర్లు, సేల్స్ మెన్ల జీతాలు పెంచిన నేపథ్యంలో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక బస్టాండ్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు కతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు.సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సూపర్ వైజర్లు,సేల్స్ మెన్లు పాల్గొన్నారు.

## ఓగూరులో 'గడపగడపకు మన ప్రభుత్వం'

**ప్రజాశక్తి -కందుకూరు** : సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఓగూరులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మహీధర్ రెడ్డి నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి వారికి అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామ ప్రజలు రోడ్లు, డ్రైన్‌ల గురించి మహీధర్ రెడ్డికి వివరించారు. ఎంపిపి ఇంటూరి సుశీల, జెడ్పిటిసి తొట్టెంపూడి అనసూర్య, వైసిపి నాయకులు ఆవుల మాధవరావు, కుమ్మర బ్రహ్మయ్య, సుబ్బారావు, చీమల వెంకటరాజా పాల్గొన్నారు.

## గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

**నెల్లూరు** :రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత ఆశయాలతో నిర్వహిస్తున్న స్పందన వేదికలో ప్రజల నుంచి అధికారులు స్వీకరించే ఫిర్యాదుల పరిష్కారంలో నగర పాలక సంస్థ అన్ని విభాగాల సిబ్బంది నిబద్ధత పాటించాలని, గడువులోపు సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించాలని కమిషనర్ హరిత సూచించారు. కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన వేదికలో ఫిర్యాదుదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించి గడువులోపు పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రతీ విభాగం ఉన్నతాధికారి తమకు సంభందించిన ఫైళ్లు పెండింగులో లేకుండా జాగ్రత్తలు వహించాలని, సూచించిన గడువులోపు సమస్యలు పరిష్కారం కావాలని కమిషనర్ స్పష్టం చేసారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా 19 సమస్యలు, స్పందన వేదికలో 20 విజ్ఞప్తులను అందుకున్నామని, గడువులోపు పరిష్కరించేందుకు కషి చేస్తామని కమిషనర్ తెలిపారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాశక్తి-ఉదయగిరి** : ప్రభుత్వ మద్యం సిబ్బంది వేతనాల పెంపుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్వైజర్లు, సేల్స్మెన్లు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్, మండల వైసిపి కన్వీనర్ అక్కి భాస్కర్ రెడ్డి హాజరై ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంచి అక్కి భాస్కర్ రెడ్డితో పాటు పలువురు నాయకులను పూల మాలలతో సిబ్బంది సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేసే సిబ్బంది కష్టాలను గుర్తించి ముఖ్యమంత్రి సేల్స్మెన్లకు రూ.3500, సూపర్వైజర్లకు రూ.4వేల పెంచడాన్ని హర్షిస్తున్నామని, ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్రెడ్డి పేద మధ్య తరగతి ప్రజల పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్బోర్డ్ డైరెక్టర్ గడియాల్చి యస్థాని, ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, ఉప సర్పంచ్ ముర్తుజా హుస్సేన్, మాజీ సర్పంచ్ ఆక్కులరెడ్డి, నాయకులు పెంచలయ్య, సురేష్, సుందరబాబు, తదితరులు పాల్గొన్నారు.

**కొడవలూరు** : బుచ్చిరెడ్డిపాలెం తహశీల్దార్ కార్యాలయంలో ఎపి బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపి.ఎస్.బి.సి.ఎల్), గవర్నమెంట్ రిటైల్ అవుట్ లెట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని సూపర్ వైజర్లు సేల్స్ మెన్లకు జీతాలు పెంచినందుకు థ్యాంక్యూ సిఎం సార్ అనే నినాదంతో సిఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రశాంత్, కిషోర్, రమణయ్య, దయాకర్, హేమ వెంకట్ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ

**ప్రజాశక్తి-వరికుంటపాడు** : మండల పరిధిలోని పెద్దిరెడ్డి పల్లి గ్రామంలో వైసిపి సీనియర్ నాయకులు పచ్చ లక్ష్మయ్య మృతిపై పలువురు నాయకులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, సోమవారం లక్ష్మయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఉదయగిరి మాజీ ఎఎంసి చైర్మన్ షేక్ అలీ అహ్మద్, మాజీ మండల కన్వీనర్ మందలపు తిరపతినాయుడు తదితర నాయకులు లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాసేవ కోసం పరితపించే వ్యక్తి మన ముందర లేడు అని తలుచుకుంటే బాధ వేస్తుందని తెలిపారు. సర్పంచ్ కుమ్మిత ప్రతాపరెడ్డి, వైసిపి నాయకులు బొల్లా మురళి, దాసరి ఎర్ర ఓబయ్య, గుర్రం వెంకటేశ్వర్లు, యనమల ప్రభాకర్ రెడ్డి, కుందూరు కొండయ్య, బండారు వెంకటరత్నం, ఆవులయ్య, తదితర నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం తగదు

**ప్రజాశక్తి-సీతారామపురం** : సచివాలయ సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం తగదని ఆత్మకూరు డివిజనల్ అభివృద్ధి అధికారి కె.రమణయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో తనిఖీ చేసి, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో అసహనంతో వెనుదిరిగారు. అనంతరం సీతారాంపురం బిట్-1, బసినేనిపల్లి సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది యూనిఫారంలో విధులకు హాజరు కావాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ చేయూతపై సమావేశం

**ప్రజాశక్తి-అల్లూరు** : మండల కేంద్రంలోని వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయం వద్ద సోమవారం మూడో విడత వైఎస్ఆర్ చేయూతపై పశుసంవర్ధక శాఖ అధికారులు సిసిలు, విఒఎలు, లబ్ధిదారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కావలి ఉప సంచాలకులు డాక్టర్ రమేష్, డిఎల్డిఎ సోమయ్య చేయూత పథకంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఇందులో 142 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు గౌతం సుష్మా, జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ సుకుమార్, రమేష్, ఎపిఎం ప్రసాద్ పాల్గొన్నారు.

## కుట్టు మిషన్లు పంపిణీ

**ప్రజాశక్తి-కావలి** : స్థానిక రెడ్డి సంఘం భవనంలో సోమవారం మహిళా ఉపాధికి అండగా రెండు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. విశ్రాంత లెక్చరర్ డి.ఇ.రావికోటి రెడ్డి తన జన్మదినం సందర్భంగా ఇద్దరు పేద మహిళలకు రెడ్డి సంఘం అధ్యక్షుడు కిష్టారెడ్డి అధ్యక్షతన శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్, కుట్టు శిక్షణ కేంద్రం శిక్షకురాలు పొన్నగంటి మాధవి, సంఘం సభ్యుల సమక్షంలో పంపిణీ చేశారు. తన జన్మదిన వేడుకను ఆర్భాటంగా కాకుండా కొందరికైనా ఆనందం కలిగించే విధంగా చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం మిషన్లు పంపిణీ చేస్తున్నట్లు కోటి రెడ్డి తెలిపారు. మహిళా ఉపాధికి అండగా కుట్టు శిక్షణ, మిషన్లు పంపిణీ చేయడంపై శిక్షకురాలు శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సుధాకర్ ధన్యవాదాలు తెలిపారు.

## ఓటు నమోదుపై అవగాహన

**ప్రజాశక్తి-కావలి** : స్థానిక శ్రీ సాయి విజేత కళాశాలలో సోమవారం కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ బి.అయ్యప్ప రెడ్డి ఆధ్వర్యంలో ఓటు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జలదంకి తహశీల్దార్ పద్మ అధ్యక్షతన, డిటీ భరత్ వక్తగా ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. శ్రీ సాయి విజేత డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్లో ఓటరుగా నమోదు చేసుకునే కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుపొందే ఓటర్ కార్డు ప్రాముఖ్యతను కరస్పాండెంట్ బి.అయ్యప్ప రెడ్డి తెలియజేశారు. ఓటర్ కార్డుకు ఎలా అప్లై చేయాలనే విషయాన్ని తహశీల్దార్ పద్మ వివరించారు. డిటీ భరత్ మొబైల్ యాప్లో డెమో నిర్వహించారు. కరస్పాండెంట్ అభ్యర్థన మేరకు తహశీల్దారు ఫారం-6 అప్లికేషన్స్ వారి ఆఫీసు నుండి ఉచితంగా తెప్పించి నింపించారు.

## నేడు వికలాంగులకు ప్రత్యేక వైద్య శిబిరం

**ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్** : ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు, అనుమసముద్రంపేట, సంగం, బుచ్చిరెడ్డిపాలెం మండలాల పాఠశాలలు హాజరయ్యే ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం వైకల్య నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ ఎస్.కె. నజీరాబాష తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు వైద్యుల పరీక్షలు ఉచితంగా నిర్ధారణ పొంది అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందించడం కోసం వైకల్య నిర్ధారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్సులు, పాస్పోర్ట్ సైజు ఫోటోలు-2, సదరన్ సర్టిఫికేట్ జిరాక్సు-1 ను విధిగా తీసుకొని రావాలన్నారు.

## కొనసాగుతున్న 'పవనన్న ప్రజాబాట'

**ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్** : పవన్ కళ్యాణ్ను ముఖ్యమంత్రి చేయాలన్న దృఢ సంకల్పంతో, ప్రజా ఆకాంక్షలను తెలుసుకోవడానికి పవనన్న ప్రజాబాట కార్యక్రమం సోమవారం 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ నలిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎ.సి.ఎస్.ఆర్. కాలనీ, వందూరుగుంట ప్రాంతాలలో పవనన్న ప్రజాబాట చేపట్టామన్నారు. ప్రతి ఇంటికి జనసేన పార్టీ కరపత్రాలను పంచుతూ, జనసేన పార్టీ సిద్ధాంతాలను తెలియజేస్తూ పవన్ అన్న ప్రజా బాట సాగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు జనసేన నాయకులు వంశీ, చంద్ర, సురేంద్ర, నాగరాజు, భాను, పవన్, అనిల్, హరిబాబు, హజరత్, తదితరులు పాల్గొన్నారు.

## 8న ఘనంగా ఉత్సవాలు

**ప్రజాశక్తి-బిట్రగుంట** : 8వ తేదిన జరిగే పౌర్ణమి గరుడ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి పేర్కొన్నారు. మండలంలోని కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి ఉత్సవాలపై జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీ గరుడ సేవ ఉత్సవాలు ఎంపిటిసి రామిరెడ్డి ప్రతాప్కుమార్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రివర్యులు కాకాణి గోవర్ధన్రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కార్యనిర్వాహణాధికారి ఆలయ ధర్మకర్తలు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నేతల ఆత్మీయ సమావేశం

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట** : జిల్లా పార్లమెంటరీ టిడిపి మైనార్టీ అధికార ప్రతినిధి ఎస్.కె.ఇంతియాజ్ ఆధ్వర్యంలో ఇందుకూరుపేటలోని వారి నివాసం వద్ద టిడిపి నేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోవూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి విచ్చేశారు. అనంతరం స్థానిక కార్యకర్తలతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధ్యక్షులు రాష్ట్ర వీరేంద్రనాథ్, జిల్లా కార్యదర్శి చెంచు కిషోర్ బాబు, అధికార ప్రతినిధి రెడ్డి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఎంఎల్ఎ ఆర్థికసాయం

**ప్రజాశక్తి-విడవలూరు** : కరోనాలో తండ్రి చనిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న కుటుంబానికి ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ తరఫున కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి అండగా నిలిచి ఆర్థికసాయం అందించారు. సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వరిణి పంచాయతీలో పర్యటించారు. అరుంధతీయవాడకి చెందిన దావులూరు నాగయ్య కొంతకాలం క్రితం కరోనాతో చనిపోవడంతో ఇద్దరు పిల్లల చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఉన్న విషయం తెలుసుకొని దావులూరు పవిత్ర రూ.20 వేలు, దావులూరు చంద్రిక రూ.20 వేలు ట్రస్ట్ ద్వారా మొత్తం 40 వేలు వారికి సొసైటీ బ్యాంకులో ఆ పిల్లలకు 18 సంవత్సరాలు వచ్చేవరకు ఫిక్స్డ్ డిపాజిట్ చేయించారు. ఆ పత్రాలను పిల్లల తల్లికి ప్రసన్నకుమార్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రోడ్లు, డ్రైయిన్లకు మరమ్మతులు చేయాలి

**ప్రజాశక్తి-కావలి**

కావలి పట్టణంలో భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని పగిలిన రోడ్లు దెబ్బతిన్న సైడ్ కాలువలను మరమ్మతులు చేయాలని సోమవారం కావలి ఆర్డిఒ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలో సుమారు నాలుగు సంవత్సరాల నుండి రోడ్లు పగిలిపోయి, సైడ్ కాలవలు దెబ్బతిని, ప్రజలు నివాస ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉంటే అధికారులు ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వం పట్టించు కోవట్లేదని దుయ్యబట్టారు. పట్టణంలో రోడ్లు సైడు కాలువలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు ప్రజా ప్రతినిధులు పట్టణంలో భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేని పరిపాలన అందిస్తామని గెలిచిన ప్రజా ప్రతినిధులు ప్రజలు పలు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. వర్షాలు కురిసినప్పుడు పట్టణంలో ట్రంకు రోడ్డులో ఒక ప్రవాహంగా నీళ్లు ప్రవహిస్తాయని తెలిపారు. పట్టణంలో రోడ్లన్నీ నిండి డ్రెయినేజీ నిండి నీళ్లు వర్షపునీళ్లు బయటకి పోక నివాస ప్రాంతాల్లో కూడా ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయన్నారు. ఇందిరమ్మ కాలనీలు ఏర్పడి ఎన్నో సంవత్సరాలు అయినప్పటికీ అక్కడ రోడ్లు సైడ్ కాలవలు వసతులు లేనందువలన చీకటపడిన చినుకు పడిన ప్రజలు బయట తిరిగే పరిస్థితి లేదన్నారు. ముఖ్యంగా ఉదయగిరి బ్రిడ్జిపై రోడ్డు దెబ్బతిని పెద్దపెద్ద గుంటలు పడి ఇనప చువ్వలు బయట పడినందున వాహన దారులు ప్రజలు నిత్యం భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇన్ని సమస్యల తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు ప్రజాప్రతినిధులు చూసి చూడనట్లు ఉండడం చాలా అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక సచివాలయ పరిధిలో 20 లక్షల నిధులు అభివృద్ధికి ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆ నిధులు ఎప్పుడు ఉపయోగ పెడతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పట్టణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలా జరగని పక్షంలో దశల వారి ప్రజా ఆందోళన చేపడుతామని ప్రజా పోరాటాల ద్వారానే అధికారులకు ప్రజాప్రతినిధులకు ప్రజలే తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎస్.వెంకయ్య, జి.మధుసూదన్ రావు, యర్రంశెట్టి కృష్ణమోహన్, పి.పెంచల నరసింహ నాయకులు కే.జాన్, బి.కష్ణయ్య షేక్.మస్తాన్, డివైఎఫ్ఐ నాయకులు పి.కోటేశ్వరరావు, కె.చెన్నయ్యఎం, కే.ప్రభాకర్, ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు

# మహాసభలకు ముమ్మర ఏర్పాట్లు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

11, 12వ తేదీల్లో ఆత్మకూరు పట్టణంలో తొలిసారిగా సిఐటియు 11వ జిల్లా మహాసభలు జరుగుతుండడంతో మహాసభ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆత్మకూరు సిఐటియు మండల శాఖ ఆధ్వర్యంలో మహాసభలను విజయవంతం చేయాలని వాల్పోస్టర్లను ఆవిష్కరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. గోడలపై మహాసభలు జయప్రదం చేయాలని రాయించి విస్తృతంగా ప్రచారం ముమ్మర ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. 11వ తేదీ మధ్యాహ్నం. 2.00 గంటలకు కార్మిక ప్రదర్శన ఆత్మకూరు ఆర్టిసి డిపో వద్దనుండి ప్రారంభమవుతుంది. సాయంత్రం 3.30 గంటలకు ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ సెంటర్లు భారీ బహిరంగ సభ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ఎంఎ గఫూర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాజరవుతారు. ప్రతినిధుల సభ 12, తేదీ రాఘవేంద్ర ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తారు. 5,6 తేదీలలో విద్యార్థులకు ప్రతిభ పోటీలు 9, 10, 11 తేదీలలో ప్రజానాట్యమండలి, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రముఖ కళాకారులతో నృత్య ప్రదర్శనలు, జానప, శాస్త్రీయ, వెస్ట్రన్ పాటలు, నాటిక ప్రదర్శనలు, జానపద కళారూపాలైన పండరి భజన, కోలాటం, చెక్కభజన, డప్పుల విన్యాసం, జడకోపు, పద్య నాటకాలు ప్రదర్శనలు జరుగుతాయి. ప్రతిభ పోటీల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తారు. ఈ ప్రదర్శనలకు ముఖ్య అతిథులుగా కళా రంగంలోని ప్రముఖులు పట్టణంలోని ప్రముఖులు హాజరవుతారు. సిఐటియు మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సందానిబాషా, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, డివైఎఫ్ఐ నాయకులు నందా శ్రీను, ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీలు గోడలపై పేర్లను రాయించారు.



గోడలపై పేర్లు రాస్తున్న సిఐటియు నాయకులు

## వాల్పోస్టర్ ఆవిష్కరణ


వాల్పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి-అనంతసాగరం**

సిఐటియు జిల్లా మహాసభల వాల్పోస్టర్ను సిఐటియు మండల కమిటీ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ 11, 12 తేదీలో జిల్లా 11వ సిఐటియు మహా సభలు ఆత్మకూరు పట్టణంలో ఘనంగా జరుగుతాయన్నారు. మహాసభలు 11న మధ్యాహ్నం 2గంటలకు ఆర్టిసి డిపో నుంచి భారీ ర్యాలీ బయల్దేరి బస్టాండు సెంటర్ వద్ద బహిరంగసభ జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి, మాజీ కర్నూల్ ఎంఎల్ఎ ఎంఎ గఫూర్ పాల్గొంటారన్నారు. మహాసభల సందర్భంగా 9, 10, 11 తేదీల్లో ఆత్మకూరు పట్టణం పాత మున్సిపల్ ఆఫీస్ వద్ద సాయంత్రం 5గంటల నుండి ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కళ ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. మహాసభలలో అనంతసాగరం మండలంలోని అంగన్వాడీ వర్కర్స్, ఆశా వర్కర్లు విఆర్ఎలు, భవన నిర్మాణ కార్మికులు, విద్యుత్ కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, స్కూల్ స్వీపర్స్, ఆటో కార్మికులు, అన్ని రంగాల కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు మీరా మొహిద్దీన్, రైతు సంఘం మండల కార్యదర్శి ఉప్పలపాడు మస్తాన్, అంగన్వాడీ వర్కర్ యునియన్ నాయకురాలు భాగ్యమ్మ, కరెంట్ యునియాన్ నాయకులూ హరి, విఆర్ఎల యూనియన్ నాయకులు మొహిద్దీన్, రవి, చిన్నయ్య, మాధవ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## లోకేష్ను కలిసిన మన ఫౌండేషన్ చైర్మన్

**ప్రజాశక్తి-ఉదయగిరి**

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ను మన ఫౌండేషన్ చైర్మన్ మన్నేటి వెంకట రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్లోని లోకేష్ నివాసంలో మన్నేటి మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు నియోజకవర్గంకు సంబంధిచి రాజకీయ, సామజిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలోని టిడిపి పరిస్థితి, కార్యకర్తల సమాచారం వెంకటరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. తానూ మాజీ ఎఎంసి చైర్మన్, మాజీ టిడిపి మండల అధ్యక్షుడిగా పార్టీకి చేసిన సేవలను తాము మరచిపోలేదని తెలిపారు. వచ్చే ఎన్నికలకు కూడా ఇదే తరహాలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మన ఫౌండేషన్ సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని అభినందించారు. నియోజకవర్గంలో 143 పంచాయతీల్లో మన ఫౌండేషన్ సేవలు మరింతగా ముందుకు తీసుకుపోవాలన్నారు. త్వరలో కుప్పం నుంచి ప్రారంభమయ్యే తన పాదయాత్ర కార్యక్రమం నియోజకవర్గం మీదుగా వెళ్తుందని నియోజకవర్గానికి సంబంధిన పాదయాత్రకులో అందుబాటులో ఉంటూ వారికి భరోసాని ఇవ్వాలని ఆదేశించారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికలలో రెండు ఎంపిటిసిలు, ముగ్గురు సర్పంచులను గెలిపించడంలో కీలకపాత్ర పోషించి పార్టీ బలోపేతానికి కృషి చేసినందుకు చైర్మన్ మన్నేటిని ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ నియోజకర్గంలో సేవ చేస్తున్న మీ రాజకీయ భవిష్యత్ పార్టీ అధిష్టానం గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో పుల్లాయపల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్రెడ్డి, చంద్రశేఖరపురం మండలం రేగలచలక సర్పంచ్ బత్తుల రమణయ్య, బిసినెస్ పార్టనర్లు సంపత్ కుమార్, రమేష్ పాల్గొన్నారు.


లోకేష్కు మొక్కను అందజేస్తున్న వెంకటరెడ్డి

# భూ సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి-కావలి**

చుక్కలభూముల బాధితుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తమ ఇళ్లను, ఇళ్ల స్థలాలను చుక్కల భూముల నుండి తక్షణమే తొలగించాలని లేనిపక్షంలో ఆందోళన చేపట్టవలసి వస్తుందని పోరాట కమిటీ కన్వీనర్లు రావి. కోటిరెడ్డి, సి.శారద, కోకన్వీనర్లు శ్రీనివాసులు, సుధాకర్, కృష్ణారెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం పోరాట కమిటీ సభ్యులు 15 మంది బాధితులు ర్యాలీ వెళ్లి తహశీల్దారు, ఆర్డిఒలకు కలిసి సమస్యను వివరించారు. అక్టోబర్ 30వ తేదీన మంగళగిరిలో జరిగిన డి.ఆర్.ఒ.ల సమావేశంలో ప్రభుత్వం నవంబర్ 15 లోగా చుక్కలభూములను తొలగించి సమస్యను పరిష్కరించాలని ఆదేశాలిచ్చినా ఇంతవరకు చుక్కల భూముల జాబితా నుండి 2008/2 సర్వేనెంబరు ఇళ్లు - ఇళ్ల స్థలాలను తొలగించకపోవడం దారుణమన్నారు. కుంటిసాకులు చెబుతూ కాలాయాపన చేస్తున్న రెవెన్యూ అధికారులు అలసత్వం వహించడం విచారకరమని తెలిపారు. తాము కష్టపడి కొనుక్కుని రిజిష్టరు చేసుకుని బ్యాంకు లోన్ తీసుకుని ఇళ్ల నిర్మాణం చేసుకున్న స్వంతదారులు తమ ఇళ్లలో 40 ఏళ్లుగా నివసిస్తుంటే ఇపుడు 2018లో చుక్కలభూములలో చేర్చడం తీవ్ర అన్యాయమని, తక్షణమే చుక్కలభూముల జాబితా నుండి ఇళ్ల స్థలాలను తొలగిస్తే తాము ఆందోళన చేయవలసి వస్తుందన్నారు. అమ్మకాలు కొనుగోళ్లు చేసుకోలేక వృద్ధాప్యంలో తమలబిడ్డల పేరుమీద రాసి రిజిష్టర్ చేసుకోలేకున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోటేశ్వరి, చలపతిరావు, వర్మ తదితర సభ్యులు పాల్గొన్నారు.


ఆర్డిఒతో మాట్లాడుతున్న పోరాట కమిటీ సభ్యులు


# పెన్షనర్స్ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి-కావలి**

జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎన్ ఎం.గౌస్, నరసింహామూర్తి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. కావలి తాలుకా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆకుల రమణయ్య, బొందిలి కుమార్ సాయిరామ్సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహాధ్యక్షులుగా పి.రవికుమార్, కోశాధికారిగా యేపూరు వెంకయ్య, ఉపాధ్యక్షులుగా కొణిదల రఘురామయ్య, ఎల్.వరప్రసాద్, పసుపులేటి నరసింహారావు, బండ్లమూడి రమణయ్య, వినమల కృష్ణయ్య, కార్యదర్శులుగా జలజనాభయ్య, షేక్. కాలేషా, ఇమ్మానుయేల్, బిట్రగుంట వెంకయ్య, దుర్గాచారి, కార్యవర్గ సభ్యులుగా నరహరి వెంకటేశ్వరరావు, చలంచర్ల ఉమామహేశ్వరరావు, వై.వి. నాగేశ్వరరావు, ఆళహరీ శ్రీనివాసరావు, షేక్. సాబ్జాన్, అమ్మనబ్రోలు వెంకట కృష్ణా రావు, గూడల శ్రీనివాసరావు, శిఖరం రామారావు, పులగం మదన్ మోహన్, దాచేపల్లి అదిశేషులు, ఓరుగంటి సుధాకర్, చెవూరు ప్రభయ్య, పి.రమేష్, డమ్ము సుకన్య, మొగిలిశెట్టి జమున ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన పెన్షనర్ సభ్యులందరికీ అధ్యక్షులు ఆకుల రమణయ్య ధన్యవాదాలు తెలియజేశారు.


ఎన్నికైన నూతన కమిటీ

## అర్హులందరికీ పథకాలు అందించాలి



**ప్రజాశక్తి-ఉదయగిరి** : సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందించే ప్రతి సేవ ప్రజలకు అందాలని ఆత్మకూర్ డివిజనల్ డెవలప్మెంట్ అధికారి రమణయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని శకునాలపల్లి సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రభుత్వం అందిస్తే ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు అందిస్తూ సచివాలయం నుండి అందిస్తున్న సేవలను అందించాలన్నారు. ముందుగా సచివాలయం నుండి అందిస్తున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విధులకు హాజరయ్యేటప్పుడు యూనిఫారం తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. బయోమెట్రిక్ హాజరు శాతాన్ని తప్పనిసరిగా వేయాలని పలు సూచనలు చేసి రికార్డులను పరిశీలించారు. పంచాయతీకార్యదర్శి కరీముల్లా తదితరులున్నారు.

## నేడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 66వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు బిఎస్పి నియోజకవర్గ అధ్యక్షుడు నంద ఓబులేశు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ బస్టాండ్ ప్రాంతంలోని ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. కావున ఆత్మకూరు నియోజకవర్గ బిఎస్పి నాయకులు, బిఎంసిఐఎఫ్ నాయకులు ఖచ్చితంగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## సచివాలయంలో ఎంపిడిఒ తనిఖీలు

**ప్రజాశక్తి-వరికుంటపాడు** : మండలంలోని యాంపాడు గ్రామ సచివాయలంలో ఎంపిడిఒ విజయ్ భాస్కర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందికి తగు సూచనలు చేస్తూ, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది అందరూ బయోమెట్రిక్ తప్పనిసరిగా ఉండాలని యూనిఫారం కచ్చితంగా ధరించాలని సూచించారు. సచివాలయానికి వచ్చే సమస్యలను పైఅధికారులకు తెలియజేస్తూ వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని తెలిపారు. విధులపై నిర్లక్ష్యం వహించే ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

## పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ

**ప్రజాశక్తి-అనంతసాగరం** : మండలంలో అక్షరచైతన్యం-2 కార్యక్రమంలో భాగంగా అక్షరాశ్యులు కావలసి ఉన్న 2370 అభ్యాసకులకు, ఎంపిపి సంపూర్ణమ్మ సోమవారం ప్రభుత్వం నుండి చదువుకుందాం భాగం-1, భాగం-2 పుస్తకాలు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. అలాగే సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లకు, వాలంటీర్లకు అందజేశారు. ఆర్.ప్రశాంతి, జూనియర్ సహాయకులు, సీనియర్ సహాయకులు ఎం.రమేష్ బాబు పాల్గొన్నారు.

## కామేపల్లికి శాంతకుమారి పరామర్శ

**ప్రజాశక్తి-వరికుంటపాడు** : మండలంలోని జగదేవి సర్పంచ్ కామేపల్లి పద్మజ భర్త వరికుంటపాడు సొసైటీ చైర్మన్ కామేపల్లి వెంకటరత్నం మోటార్ సైకిల్ యాక్సిడెంట్లో గాయపడి అనారోగ్యంతో ఉన్న ఆయనను సోమవారం నియోజకవర్గ ప్రచార కార్యదర్శి శాంతి కుమారి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

## నిందితుడు అరెస్టు

**ప్రజాశక్తి-సీతారామపురం** : మండలంలో జరిగిన చోరీ కేసును సోమవారం పోలీసులు చేదించారు. వివరాల మేరకు మండలంలోని గంగవరం ఎస్సి కాలనీలోని కారు జయమ్మ ఇంట్లో గత గురువారం పట్టపగలే చోరీ జరిగింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉదయగిరి సిఐ వి.గిరిబాబు సీతారామపురం ఎస్ఐ కె.కిషోర్బాబులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. సీతారామపురం మండలం బసినేని పల్లి గ్రామానికి చెందిన మన్నెం ఆనంద్ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ వివరాలను తెలిపాడని, నిందితుడి నుండి 31 గ్రాముల బంగారం రూ.4000 నగదును స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. చోరీ జరిగిన నాలుగు రోజులలోనే కేసును ఛేదించిన సిఐ గిరిబాబును ఎస్ఐ కిషోర్ బాబులను ఎస్పి విజయరావు అభినందించినట్లు తెలిపారు.

## గేదెను ఢీకొని స్కూటరిస్ట్ మృతి

**ప్రజాశక్తి-మర్రిపాడు** : మండలంలోని కదిరి నాయుడుపల్లి సమీపంలో గేదెను ఢీకొని స్కూటరిస్టు మృతి చెందిన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. కడప జిల్లా బద్వేల్కు చెందిన సయ్యద్ మహమ్మద్ అలీం (30) కలువాయి లోని తన స్నేహితుని ఇంటికి ఫంక్షన్ కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బద్వేల్ వెళ్తుండగా మోటార్ బైక్కు గేదె అడ్డురావడంతో ఢీ కొట్టడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేశారు.

## బిసిలపై దాడులు హేయం : టిడిపి

**ప్రజాశక్తి-ఉదయగిరి** : పుంగనూరులో బిసి నాయకుడు రామచంద్ర యాదవ్ అతని ఇంటిపై వైసిపి గూండాలు దాడి చేయడం హేయమైన చర్యగా తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ జెడ్పి చైర్మన్ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచల బాబు యాదవ్ విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి బలహీన వర్గాల వారిని ఆదరిస్తున్నారని బలహీన వర్గాల కోసం వైసిపి అండగా ఉంటుందని తెలియజేస్తూ, వారిపై దాడులు జరుగుతుంటే ముఖ్యమంత్రి ఖండించకపోవడం బలహీన వర్గాలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని ధ్వజమెత్తారు. పుంగనూరులో రామచంద్ర యాదవ్ చేసిన తప్పేంటని ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయాల రాణించవచ్చన్నారు. పుంగనూరులో రాజకీయంగా ఎదిగితే వైసిపికి గుణపాఠం తప్పదని భయంతో రామచంద్ర యాదవ్పై దాడులు చేసి దాదాపు రెండు కోట్ల రూపాయల ఆస్తులను ధ్వంసం చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రజాశక్తి-కొడవలూరు** : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు, కోవూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్ఛార్జి పోలంరెడ్డి దినేష్ రెడ్డి ఆదేశాల మేరకు. సోమవారం కోవూరు నియోజకవర్గం కొడవలూరు తహశీల్దార్ రమాదేవికి ఇదేమి కర్మ మన బిసిలకు అంటు బిసిలకు జరుగుతున్న అన్యాయాలు, దాడులు, వారిని జలగల్లాగ పట్టి పీడిస్తున్న ప్రస్తుత అరాచక పాలన పైన టిడిపి నాయకులు ధ్వజమెత్తారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిసి సంక్షేమ పథకాలు, బిసిలు సబ్ ప్లాన్ నిధులు, వారి కులవత్తులు, చేతి వత్తి చేసుకునే వారికి మొండి చేయి చూపిస్తున్న ఈ అరాచక పాలన, స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్ను నీరుగారుస్తున్న ఈ ప్రభుత్వ అరాచకాలు పైన వినతి పత్రం అందజేశారు. టిడిపి మండల అధ్యక్షులు కోటంరెడ్డి అమరేంద్ర రెడ్డి, చెక్క మదన్, నాశం ప్రసాద్, రమణయ్య, మురళి పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఉదయగిరి** : నియోజకవర్గం స్థాయిలో జరిగే బిసి నిరసనను విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ చింతబోయిన బయన్న బిసి మండల అధ్యక్షులు బడబాగ్ని నరసింహారాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు సోమవారం మాట్లాడుతూ మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో చేపట్టే నిరసన కార్యక్రమం ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వెనుకబడిన తరగతులతో పెద్ద ఎత్తున చేపట్టి నిరసనను టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెమ్మ నాయుడు రాష్ట్ర బిసి విభాగం అధ్యక్షులు కొల్లు రవీంద్ర పిలుపుమేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఎరువుల దుకాణంలో తనిఖీ



**ప్రజాశక్తి-బిట్రగుంట** : మండలంలోని నాగులవరం, ఎబి కండ్రిక,సోమేశ్వరపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎరువులు దుకాణాలను ఆత్మకూరు వ్యవసాయ సహాయకులు వి.దేవసేనమ్మ, నెల్లూరు వ్యవసాయ అధికారి ఎస్ నాగమోహన్, మండల వ్యవసాయ అధికారి ఎస్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణం యజమానులు అనుమతులు పొందిన ఓ ఫారం ద్వారా ఎరువులను తెప్పించుకోవాలన్నారు. ఓ ఫారం లేని 145 బస్తాలను రూ.39,249 విలువైన యూరియా స్టాకు అనుమతులు నిరాకరిస్తున్నట్లు తెలిపారు. ఓ ఫారం తెచ్చుకున్న తర్వాతే స్టాక్ను విక్రయించాలని యజమానులకు తెలిపామన్నారు.

## సిసిలతో ఎపిఎం సమీక్ష

**ప్రజాశక్తి-వరికుంటపాడు** : స్థానిక స్త్రీ శక్తి భవనంలో సిసిలు, విఒఎలతో వైఎస్ఆర్ క్రాంతి పథం ఎ.పి.ఎం. వైనారుతు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ నిధి, ఉన్నతి, సి.ఐ.ఎఫ్. రుణాల రికవరీ నూరు శాతం సాధించాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ఈ నెల 10వ తేదీలోగా వైఎస్ఆర్ ఆసరా మూడో విడత లబ్ధిదారుల బయోమెట్రిక్ పూర్తి చేయాలని తెలిపారు. సిసిలు జానకమ్మ, వెంకట రమణమ్మ, ప్రభావతి, ప్రమీల, రవి, విఒఎలు తదితరులున్నారు.

## 'శ్రీ వెంకటేశ్వర'లో జాబ్ ఆఫర్స్

**ప్రజాశక్తి-కొడవలూరు** : మండలంలోని నార్త్ రాజుపాలెం శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ట్రైనింగ్ ప్లేస్మెంట్లో నూతన ఒరవడి సాగిస్తూ రాబోయే 2023 సంవత్సరపు బిటెక్ విద్యార్థులకు అత్యున్నత ప్యాకేజీ ప్లేస్మెంట్స్ వైపు ప్రయాణిస్తుందని కళాశాల చైర్మన్ డాక్టర్ పెనుబల్లి బాబు నాయుడు తెలిపారు. సోమవారం దిగ్గజ కంపెనీ బ్యాంక్ ఆఫ్ అమెరికా, టాటా అనాలాటిక్స్ విభాగపు అధ్యయనపు వైస్ ప్రెసిడెంట్ వెంకట సాయిపై శ్రీ వెంకటేశ్వర కళాశాల మూడవ సంవత్సరపు బిటెక్ విద్యార్థులకు ట్రైనింగ్ అవగాహన కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు కంపెనీల ఉద్యోగాలతో పాటు విదేశీ కంపెనీ ఉద్యోగాలకు హెచ్ఐబివిఐ ఎస్ఎకు అనుమతి రావడం సంతోషకరమని కాలేజీ డైరెక్టర్ పెనుబల్లి కృష్ణ చైతన్య, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.కుమార్ బాబు, కళాశాల ప్లేస్మెంట్ డైరెక్టర్ బెల్లంకొండ రాజేష్ సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రపంచ వికలాంగుల దినోత్సవం

**ప్రజాశక్తి-ఉదయగిరి**

మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్ వలీ సోమవారం ఎంపిపిఎస్ దళితవాడ పాఠశాలలో ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వారు సరఫరా చేసిన ఉపకరణాలైన మూడు చక్రాల సైకిళ్లను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వికలాంగులైన పిల్లలు వారు వికలాంగులమనే భావన రాకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. వికలాంగ విద్యార్థులకు ప్రభుత్వ వారు అందించే వివిధ సంక్షేమ పథకాలను వారికి అందే విధంగా ఉపాధ్యాయులు చూడాలన్నారు. ప్రతి సోమవారం జరిగే ఫిజియోథెరపీకి దివ్యాంగులైన పిల్లలు అందరూ హాజరై ఫిజియోథెరపీ చేయించుకునే విధంగా తగు జాగ్రత్తలు వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ టి హుసేని కలీం, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, అర్షియ, ఫిజియోథెరపిస్ట్ చాముండేశ్వరీ, ఐఇఆర్టి విజయ్ పాల్గొన్నారు.





**In the Court of the Junior Civil Judge, Kovur**

**O.S.No. 250 / 2020**

**Union Bank of India, Damaramadugu Branch,** Buchireddypalem Mandal, SPSR Nellore District, Represented by its Branch Manager - Plaintiff

Vs

1. **Adapala Sarojanamma** and 3 Others - Defendants

**Notice**

To,
**D1. Adapala Sarojanamma,** Wife of Late **Adapala Radha Krishna Reddy,** Residing at Flat No.201, Legesy Homes, Iskon City, Near SRK Next Gen School, Nellore City, SPSR Nellore District.

పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే09-12-2022**దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

**Sk. Yasdani,** B.Com. LLB.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.